సాక్షి
బుధవారం । 26 । మార్చి । 2025

# దక్షిణాది రాష్ట్రాలకు నిధుల కేటాయింపులు పెరగాలి

## జాతీయ సదస్సులో నిపుణులు



సదస్సులో మాట్లాడుతున్న ఘంటా చక్రపాణి

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ ఆర్థిక శాస్త్ర విభాగం, తెలంగాణ రాష్ట్ర ఉన్నత మండలి, ఐసీఎస్ఎస్ఆర్–దక్షిణ భారతదేశ ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో 'భారతదేశంలో ఆర్థిక సమాఖ్యవాదం: వికేంద్రీకరణ, అభివృద్ధి, ఆర్థిక గతిశీలత' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు మంగళవారం ప్రారంభమైంది. నేషనల్ ఇనిస్టిట్యూ్యట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ (న్యూఢిల్లీ) విశిష్ట అధ్యాపకులు పినాకి చక్రవర్తి ముఖ్యఅతిథిగా హాజరై సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16వ ఆర్థిక సంఘం కోవిడ్ తర్వాత వివిధ రాష్ట్రాల్లో పర్యటించి ఆర్థిక అభివృద్ధి, నిర్వహణపై దృష్టి సారించిందన్నారు. రాష్ట్రాలు ఆర్థిక స్వయం ప్రతిపత్తి పొందడానికి పన్ను వికేంద్రీకరణను 42 శాతానికి ఆర్థిక కమిషన్ పెంచిందని వెల్లడించారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి, అంబేడ్కర్ వర్సిటీ ఉపకులపతి ఘంటా చక్రపాణి మాట్లాడుతూ సామాజిక ధర్మంలో భాగంగా సమాజంలోని అన్ని వర్గాలకు అంబేడ్కర్ విశ్వవిద్యాలయం సేవలు అందిస్తుందన్నారు. గత దశాబ్ద కాలంగా కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు జరగాల్సిన స్థాయిలో చేయకున్నా దక్షిణ భారతదేశం అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. ఉత్తర–దక్షిణ ప్రాంతాలకు నిధుల కేటాయింపులపై సమగ్ర చర్చ జరగాలని భావిస్తున్నట్లు చెప్పారు. ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సభ్యులు అరవింద్ వారియర్, విశ్వవిద్యాలయ అకడమిక్ డైరెక్టర్ పుష్పా చక్రపాణి, సామాజిక శాస్త్రాల విభాగ డీన్ వడ్డాణం శ్రీనివాస్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు బుధవారం మార్చి 26, 2025

# హుస్నాబాద్‌లో ఇంజినీరింగ్ కళాశాల

- **శాతవాహన వర్సిటీ ప్రాంగణంలో లా కళాశాల ఏర్పాటు**

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో మరో కొత్త ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు కానుంది. సిద్దిపేట జిల్లా పరిధిలోని హుస్నాబాద్‌లో శాతవాహన వర్సిటీ కింద తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా జీవో 18 జారీ చేశారు. ప్రస్తుతం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జగిత్యాల, మంథని, సిరిసిల్లలో జేఎన్‌టీయూహెచ్ కళాశాలలు ఉండగా తాజాగా హుస్నాబాద్‌లో ఏర్పాటు కానుంది. కాకపోతే కొత్త జిల్లాల ప్రకారం ప్రస్తుతం హుస్నాబాద్ సిద్దిపేట జిల్లా పరిధిలో ఉంది. కరీంనగర్‌లోని శాతవాహన వర్సిటీ ప్రాంగణంలో లా కళాశాలను కూడా మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో 19 జారీ చేసింది. ఈ రెండింటిలోనూ వచ్చే కొత్త విద్యా సంవత్సరం(2025-26) నుంచి ప్రవేశాలు ప్రారంభంకానున్నాయి. గత డిసెంబరులో పెద్దపల్లిలో జరిగిన బహిరంగ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కళాశాలల ఏర్పాటుపై సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఆ వెంటనే శాతవాహన వర్సిటీ పరిధిలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం రాష్ట్ర ఉన్నత విద్యామండలికి ఆదేశించింది. త్రిసభ్య కమిటీ సభ్యులు ఆచార్య విజయకుమార్ రెడ్డి(జేఎన్‌టీయూహెచ్ రెక్టార్), ఆచార్య కృష్ణయ్య (ఓయూ), శ్రీనాథ్(రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ జేడీ) నివేదిక అందజేశారు. తాజాగా ఇంజినీరింగ్, లా కళాశాలలు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా సీఎంకు మంత్రి పొన్నం ధన్యవాదాలు తెలిపారు.

★ రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులతోపాటు ఇంజినీరింగ్ కళాశాలకు రూ.44.12 కోట్లు, లా కళాశాలకు రూ.22.96 కోట్ల నిధులు కూడా మంజూరు చేసింది. ఇంజినీరింగ్‌లో సీఎస్ఈ, ఏఐ, ఐటీ, ఈసీఈ బ్రాంచీలు 60 చొప్పున సీట్లతో అందుబాటులోకి వస్తాయి. 10 శాతం ఈడబ్ల్యూఎస్ కోటా కలుపుకొంటే మరో 24 సీట్లు అదనంగా చేరతాయి. అంటే మొత్తం 264 సీట్లు ఉంటాయి.

★ లా కళాశాలలో డిగ్రీ విద్యార్హతపై మూడేళ్ల ఎల్ఎల్‌బీ రెండు సెక్షన్లు మంజూరు చేశారు. ఒక్కో దాంట్లో 60 చొప్పున సీట్లుంటాయి. ఇక రెండేళ్ల ఎల్ఎల్ఎం ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఒక సెక్షన్.. అంటే 20 సీట్లు ఉంటాయి. వాటికి 10% ఈడబ్ల్యూఎస్ కోటా అదనం.